RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 228

గురువారం
ఆగస్టు 07, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

3లో..

## బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు నిద్రపోం



**- పోరుబాట ధర్నాలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి**

**వేద న్యూస్, డెస్క్:**

జంతర్ మంతర్ ధర్నాతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కుతాయని తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, తమ డిమాండ్‌ను ఆమోదించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. రిజర్వేషన్లు సాధించే వరకు నిద్రపోమని పేర్కొన్నారు. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి శాసనసభ ఆమోదించిన రెండు బిల్లులకు వెంటనే ఆమోదం తెలపాలని సీఎం కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని పరిమితి విధిస్తూ చేసిన చట్టాన్ని సవరిస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్ కు కూడా ఆమోదముద్ర వేయాలని విజ్ఞప్తి చేశారు.

**- తెలంగాణ దేశానికి మోడల్**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన బిల్లులను ఆమోదించాలన్న అంశంపై ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన పోరుబాట ధర్నా కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ ధర్నాలో పార్లమెంట్ లో ప్రతిపక్ష ఇండియా కూటమికి చెందిన పలువురు పార్లమెంట్ సభ్యులు పాల్గొని ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న తెలంగాణ సంకల్పానికి మద్దతును ప్రకటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ పోరుబాట కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా శాసనసభలో విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదముద్ర వేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా చేపట్టే జనగణనలో కులగణన తెలంగాణ నమూనా దేశానికి ఆదర్శంగా, రోల్ మాడల్ గా నిలుస్తుందన్నారు. ఫిబ్రవరి 4, 2024 రోజున ప్రారంభించి సరిగ్గా ఏడాది కాలంలో 4 ఫిబ్రవరి 2025 నాటికి సర్వే పూర్తి చేసి రిజర్వేషన్లు కల్పిస్తూ పరిష్కార మార్గం చూపించామన్నారు. ఆ రిజర్వేషన్లను సాధించుకోవడానికే సడక్ నుంచి సంసద్ వరకు వచ్చామని, యావత్ దేశం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోందని చెప్పారు. వందేళ్లలో ఇలాంటి ప్రక్రియ చేపట్టలేదని, రాష్ట్రాలను పాలించిన దాదాపు మూడు వందల మంది ముఖ్యమంత్రులు ఎవరూ చేయలేని సాహసం తెలంగాణ మంత్రిమండలి విజయవంతంగా పూర్తి చేసిందని తెలిపారు. తెలంగాణ శాసనసభ చేసిన బిల్లులు, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగిస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్ గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి చేరి నాలుగు నెలలైనా ఆమోదముద్ర పడలేదని, ఆ నేపథ్యంలోనే చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం సంకల్పించిన బీసీ రిజర్వేషన్లకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఎంతో మంది పార్లమెంట్ సభ్యులు మద్దతుగా నిలబడ్డారని పేర్కొన్నారు. ఈ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో నినదించిన విషయాలను

మిగతా 2వ పేజీలో..



## సిటీ కాలేజి బాక్ లాగ్ విద్యార్థులకు వన్ టైమ్ ఛాన్స్

**వేద న్యూస్, హైదరాబాద్ :**

డిగ్రీ ఫెయిలైన విద్యార్థులకు ప్రభుత్వ సిటీ కాలేజీ సువర్ణావకాశం కల్పిస్తున్నది. కాలేజీలో 2007-2019 మధ్య డిగ్రీ బిఎ, బికామ్, బియస్సీ, బిబిఏ చదివి బాక్ లాగ్ సబ్జెక్టులను పూర్తిచేయలేకపోయిన విద్యార్థులకు వన్ టైం చాన్స్ ఇస్తున్నట్లు ఎక్జామినేషన్ బ్రాంచ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలకు హాజరవ్వాలనుకుంటున్న విద్యార్థులు సాధారణ పరీక్ష రుసుముతో పాటు నిర్ణీత అదనపు రుసుమును కూడా చెల్లించవలసి ఉంటుంది. ఎగ్జామినేషన్ రుసుము చెల్లించి, అప్లికేషన్ ఫారమ్ సబ్మిట్ చేయడానికి చివరి తేది 12.08.2025. రూ.500 ఆలస్య రుసుముతో చివరి తేది 18.08.2025. గ్రూపులవారీ ఫీజు వివరాల కోసం కాలేజీ వెబ్సైట్ చూడవచ్చు లేదా కాలేజీలో సంప్రదించవచ్చు.

## డిజిటల్ మోసాలపై అవగాహన



**వేద న్యూస్, గంగాధర :**

'సైబర్ జాగ్రూక్త దివస్' సందర్భంగా గంగాధర మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ ఇంటర్మీడియట్ కళాశాలలో బుధవారం సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గంగాధర ఎస్సై వంశీకృష్ణ హాజరై మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు ఇలాంటివి వాటిపైన అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపారం, పెట్టుబడి మోసాలు, పార్ట్ టైం ఉద్యోగాల పేరిట మోసాలు, గుర్తింపు దొంగతనం, క్రెడిట్ కార్డుల దుర్వినియోగం, నకిలీ రుణ యాప్లు, రుణ మోసాలు, ఆన్లైన్ షాపింగ్ లో వస్తువులు డెలివరీ కాకపోవడం, ఇలా పలు మోసాల రూపాలను వివరించారు. ఆన్లైన్ భద్రతా చిట్కాలు గురించి విద్యార్థులకు సూచనలు చేశారు. డిజిటల్ ప్రపంచంలో మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంచ్యతండా లిఫ్ట్ సమస్యలపై స్పందించిన మంత్రి ఉత్తమ్

**వేద న్యూస్, మఠంపల్లి :**



సూర్యాపేట జిల్లా హుజుర్ నగర్ నియోజకవర్గ పరిధిలో గల మఠంపల్లి మండలం మంచ్యతండా లిఫ్ట్ సమస్య పై మంగళవారం హైదరాబాద్ లో జరిగిన సమీక్ష సమావేశంలో మంచ్యతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు మాలోతు బాబు నాయక్ మాట్లాడుతూ మంచ్యతండా లిఫ్ట్ పూర్తిగా శిదిలావస్థలో ఉందని మోటార్లు, పైపు లైన్లు పనిచేయడం లేదని దీనివల్ల రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని మంత్రి ఉత్తమ్

మిగతా 2వ పేజీలో..

## కల్తీ మద్యం గుట్టు రట్టు

**వేదన్యూస్, వేములవాడఅర్బన్ :**




వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం గ్రామంలో కల్తీ మద్యం తయారీ వ్యవహారాన్ని ఎక్సైజ్ పోలీసులు భగ్నం చేశారు. బ్రాండెడ్ మద్యం సీసాలను సేకరించి వాటిలో నీళ్లు, చీప్ లిక్కర్ నింపి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు నిందితులు గత ఆరు నెలలుగా ఈ కల్తీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్టు ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. స్థానిక సమాచారం మేరకు నిందితుల ఇంటిపై దాడి నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు పెద్దఎత్తున ఖాళీ మద్యం సీసాలు, కల్తీ లిక్కర్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, ఆరోగ్యానికి హానికరమైన కల్తీ మద్యం విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు మీడియా సమావేశంలో హెచ్చరించారు.

## పౌష్టికాహారం అందిస్తూ..పాఠాలు బోధించాలి

**వేద న్యూస్, తంగళ్ళపల్లి :**



అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, ప్రీ ప్రైమరీ పాఠాలు బోధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం చీర్లవంచలో నూతనంగా నిర్మించిన రెండు అంగన్వాడీ కేంద్రాల భవనాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,కే కే మహేందర్ రెడ్డి తో కలిసి బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. జిల్లాలో మొత్తం 585 అంగన్వాడీ కేంద్రాలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయని వివరించారు. డీఎంఎఫ్టీ నిధులు రూ. 20 కోట్లతో జిల్లాలోని ఆయా మండలాల్లో మొత్తం 170 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలో మొత్తం 49 నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.అన్ని భవనాలు రానున్న ఆరు నెలల్లో అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ వెల్లడించారు. ఇందులో భాగంగా తంగళ్ళపల్లి మండలం చీర్లవంచలో నూతనంగా నిర్మించిన రెండు అంగన్వాడీ కేంద్రాల భవనాలను ప్రారంభించామని వివరించారు.ప్రీ ప్రైమరీ విద్య బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నూతన భవనాలు నిర్మించి, మౌలిక వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు. పిల్లలు ఆడుతూ.పాడుతూ విద్యను అభ్యసించే అవకాశం

మిగతా 2వ పేజీలో..

## నిషేధిత గుట్కా పాకెట్ల పట్టివేత

**వేద న్యూస్, శాయంపేట :**



శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామంలో నిషేధిత టొబాకో ప్యాకెట్లు శాయంపేట పోలీసులు పట్టుకున్నారు. శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా ప్రగతి సింగారం గ్రామస్తుడు అయిన దూలం జయపాల్ కిరాణం షాపులో ప్రభుత్వ నిషేధిత టోబాకో ప్యాకెట్లు అమ్ముతున్నాడానే సమాచారం రాగ వెంటనే ప్రగతి సింగారం గ్రామంలోని జై హనుమాన్ కిరాణం తనిఖీ చేయగా అక్కడ రూ. 6,513 విలువ గల ప్రభుత్వ నిషేధిత టోబాకో ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో షాప్ యజమాని దూలం జయపాల్ ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వ నిషేధిత గుట్కాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# తల్లిపాలతో పిల్లలకు ఆరోగ్యం

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ టీచర్ అమ్మ కల్పనా దేవి ఆధ్వర్యంలో తల్లిపాల ఉత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ అభిరామిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ప్రపంచ తల్లిపాల ఉత్సవాలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బిడ్డకు తల్లి పాలే అమృతమని, ముర్రు పాలల్లో పాలల్లో రోగనిరోధక శక్తి ఉంటుందని, తల్లిపాలు తాగిన బిడ్డకు డయేరియా , నియోనియా దరిచేరవ నీ తెలిపారు. తల్లిపాలు ఇస్తే బిడ్డకు ఎంత క్షేమమో ప్రజలకు తెలపడం కోసమే.. తల్లిపాల ఉత్సవాలు ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సాంబ లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు సృజన, అరుణ, విజయ కుమారి, ఆశ వర్కర్లు, గర్భిణులు,బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ బిజెపి..ప్రతి ఇంటికి బూత్ అధ్యక్షుడు

**వేద న్యూస్, ఐనవోలు :**



భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం ఐనవోలు మండల కేంద్రంలో 170వ బూత్ అధ్యక్షులు పులి సాగర్ గౌడ్ ఆధ్వర్యంలో మహా సంపర్క్ అభియాన్ లో భాగంగా "ఇంటింటికి బిజెపి ప్రతి ఇంటికి బూత్ అధ్యక్షుడు" పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పాల్గొనడం జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని మోసాన్ని నరేంద్ర మోదీ పథకాల గొప్పతనాన్ని నిబద్ధత గల సైనికులుగా పనిచేసే భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ఈ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మరింత బలంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాదాసు ప్రణయ్, మండల ప్రభారి కనుకుంట్ల రంజిత్ కుమార్, జిల్లా బిజెపి నాయకులు గుండెకారి కోటేశ్వర్, బొల్లెపల్లి మహేష్ గౌడ్, సూదుల రవీందర్ రెడ్డి కోట నరసయ్య గౌడ్ నరిగె రాజేష్ తీగల రాజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ సెక్యూరిటీపై అవగాహన

**వేద న్యూస్, హైదరాబాద్ :**



సిటీ కాలేజీ ఎన్.సిసి, డ్రగ్,ర్యాగింగ్ నివారణ కమిటీ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలోని విద్యార్థులకు సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ కెవిఎమ్ ప్రసాద్, ఎస్ ఐ చందన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ క్రైమ్స్ యువతను లక్ష్యంగా చేసుకుంటూ వేగంగా విస్తరిస్తున్నాయని, సోషల్ మీడియా, ఫేక్ లింకులు, డేటా హ్యాకింగ్ వంటి మార్గాల ద్వారా నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. యువత ఏ మాత్రం అనుమానం వచ్చినా ఆలస్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ముఖ్యంగా వాట్సాప్, గూగుల్ లింకులు, ఖాతా వివరాలు వంటి వాటిలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.విప్లవ్ దత్ శుక్లా మాట్లాడుతూ, 'సైబర్ నేరాలపై యువత అవగాహన చాలా ముఖ్యమని, ఇవి వ్యక్తిగత డేటా చౌర్యం, ఆన్‌లైన్ మోసాల వంటి నేరాలను నివారించడంలో సహాయపడతాయని అన్నారు. యువత సురక్షితమైన ఆన్‌లైన్ విధానాలను అనుసరించాలని, అనుమానాస్పద లింక్‌లను నొక్కకపోవడం చాలా అవసరమని తెలిపారు. అవగాహన కలిగిన యువత వల్లనే సైబర్ నేరాలు తగ్గుతాయని, అవగాహన పెంచుకోవటమే కాక, తమకు తెలిసిన భద్రతా చర్యల గురించి తోటివారికి తెలియజేయాలని సూచించారు. ఎస్ ఐ చందన సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు క్విజ్, స్కిట్, పోస్టర్ మేకింగ్ నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు అందచేశారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని ఎన్.సిసి, డ్రగ్, ర్యాగింగ్ నివారణ కమిటీ కన్వీనర్ డా.ఎస్.పి.కృష్ణవేణి సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో హయ్యర్ ఎడ్యుకేషన్ యాంటీ డ్రగ్ అధికారి అన్నపూర్ణ, డా.శంకర్ కుమార్, డా.భాస్కర్, డా.ఆనంద్, డా.శ్రీదేవి, డా.సంతోష్ కుమార్, డా.తిరుపతి, పిసి నవీన్, ఎన్ సిసి కాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉచిత నేత్ర వైద్య శిబిరం

**వేద న్యూస్, చొప్పదండి :**

లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి ఆధ్వర్యంలో ఈరోజు రేకుర్తి కంటి ఆసుపత్రి వారి చే శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్ వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా 320జి మొదటి ఉపగవర్నర్ మోర భద్రేశం విచ్చేసి మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి ద్వారా పేదలకు సేవ చేయడం మాత్రమే కాకుండా ఆరోగ్య పరమైన క్యాంపు లు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగానే ఈరోజు ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి అని తెలిపారు. ఈ వైద్య శిబిరం లో 70 మంది కి పరీక్షలు నిర్వహించగా 30 మంది ఆపరేషన్స్ చేయాల్సింది గా తెలిపారు. కానీ 13 మంది ఆపరేషన్ కొరకు రేకుర్తి ఆసుపత్రి కి వారి వాహనము లో తీసుకెళ్ళడం జరిగిందన్నారు. మిగిలిన వారు ఈ వారం లో వెళ్తారు అని అధ్యక్షులు తొడుపునూరి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ కొల్లూరి జితేందర్, జోన్ చైర్మన్ చింతల రవి, సెక్రటరీ సిరిపురం రాజు, ప్రోగ్రాం చైర్మన్ మామిడి రాజేష్ పవార్, క్యాబినెట్ సభ్యులు, కొల్లూరి ఆనందం, పెద్ది లక్ష్మికాంతం, తొడుపునూరి లక్ష్మయ్య, వల్లాల జగన్, దూస రాము, తాటిపెల్లి సందీప్, తాటి పెల్లి శివ కుమార్, రేకుర్తి కంటి ఆసుపత్రి టెక్నీషియన్ చింతా ప్రభాకర్ పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లు సాధించే
# వరకు నిద్రపోం



తెలంగాణ గ్రామ గ్రామాన చేరవేయాలి. ఒక గొప్ప లక్ష్యంతో ఢిల్లీ వేదికగా పోరాటం సాగిస్తున్నామ న్నారు. రాష్ట్రపతి తమ బిల్లులను వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో డీఎంకే, సమాజ్ వాది, ఎన్సీపీ, శివసేన, సీపీఎం తదితర పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు పాల్గొని తెలంగాణ సంకల్పించిన 42 శాతం బీసీ రిజర్వేషన్లకు మద్దతును ప్రకటించారు.

ఈ ధర్నాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , దామోదర రాజనర్సింహ,దుద్దిళ్ల శ్రీధర్ బాబు,తుమ్మల నాగేశ్వరరావు,జూపల్లి కృష్ణారావు , కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వివేక్ వెంకటస్వామి,అడ్లూరి లక్ష్మణ్ , వాకిటి శ్రీహరి, సలహాదారులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# అభివృద్ధిలో పరుగులు తీస్తున్న భారత్

**వేద న్యూస్, చొప్పదండి**



ప్రధానిగా నరేంద్ర మోడీ అధికారం చేపట్టాక దేశం అన్ని రంగాల్లో ఎదిగిందని బీజేపీ కార్య కర్తలు పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం పిలుపు మేరకు చేపట్టిన ఘర్ ఘర్ కి బీజేపీ కార్యక్రమంలో బాగంగా బుధవారం మండలంలోని రంగశాయి పల్లిలో ప్రజల్ని కలిశారు. దేశం ధర్మం కోసం పార్టీ ప్రభుత్వం చేపట్టే వివిధ అంశాలను ఇంటి ఇంటికి తిరిగి వివరించారు. పార్టీ మాజీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు శక్తి కేంద్రం ఇంచార్జి కట్ట రవి, మునిగంటి శ్రీనివాస్, గంట్ల రవీందర్ రెడ్డి, గ్రామ భూత్ అధ్యక్షులు మండల శేఖర్ తదితరులున్నారు.

## అమృతమ్మ పార్థివ దేహానికి
# నివాళర్పించిన మాజీ ఎమ్మెల్యే

**వేద న్యూస్,బోయినిపల్లి :**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మల్లాపూర్ గ్రామంలోని బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు వేసిరెడ్డి రాజేందర్ రెడ్డి, తల్లి నిన్నటి రోజున స్వర్గస్తులైనారు. అమృతమ్మ, ఆత్మకు శాంతి చేకూరాలని నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన చెప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్. వారి వెంట బిఆర్ఎస్ మాజీ ఎంపీపీ మాధవ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొనుకటీ లచ్చిరెడ్డి,మాజీ సర్పంచ్ గుంటి శంకర్, పార్టీ సీనియర్ నాయకులు మాధవ రెడ్డి, సోషల్ మీడియా కమల్ గౌడ్, మంత్రి మధు శివ తదితరులు పాల్గొన్నారు.

# మంచ్యతండా లిఫ్ట్ సమస్యలపై స్పందించిన మంత్రి ఉత్తమ్

చొరవతీసుకొని లిఫ్ట్ ను మరమ్మత్తులు చేయించి గిరిజన రైతులను ఆదుకోవాలని కోరడం జరిగింది. సమస్య పై స్పందించిన మంత్రి ఉత్తమ్ లిఫ్ట్ కు వెంటనే మరమ్మత్తులు చేయాలని ఇరిగేషన్ ఇ ఇ ని అదేశించడం జరిగింది. ఈ విషయం పై బుధవారం ఇరిగేషన్ ఇ ఇ ని బాబునాయక్ సంప్రదించగా హైదరాబాద్ నుండి లిఫ్ట్ కు సంబందించిన మెటీరియల్ ను తీసుకొని తమ సిబ్బంది బయలుదేరారని తెలిపినట్లు ఎన్నో సంవత్సరాలనుండి మరుగున పడిన లిఫ్ట్ మరమత్తులకు నోచుకోనే విధంగా చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్యా మంజీనాయక్ కు తమ తండా ప్రజలు రుణపడి ఉంటామన్నారు.

# పౌష్టికాహారం అందిస్తూ.. పాఠాలు బోధించాలి

వస్తుందని వివరించారు. పక్కా భవనాలతో అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని ఇబ్బందులు తొలగిపోతున్నాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, స్థానిక నాయకులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఆచార్య ప్రొ.కొత్తపల్లి జయశంకర్ జయంతి



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను యావత్ ప్రపంచానికి చాటి చెప్పి ప్రత్యేక రాష్ట్ర సాధనకు జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ అని అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి అధికారులు,పోలీస్ సిబ్బందితో కలసి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ సిద్ధాంతకర్తగా తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం తన జీవిత కాలం రాష్ట్ర సాధనకే త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటిచెప్పి ఉద్యమ స్ఫూర్తితో ప్రజలను చైతన్యం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం,స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజలకు పోలీస్ శాఖ ద్వారా మరింత మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు రమేష్,యాదగిరి,కార్యాలయ సూపరింటెండెంట్ లు,జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

**వేద న్యూస్, గంగాధర :**

గంగాధర మండలం మధురానగర్ లోని ఎమ్మెల్యే ప్రజా కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుమల్ల మనోహర్ మాట్లాడుతూ "రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయాన్ని సునిశ్చితం చేయాలనే లక్ష్యంతో గ్రామ స్థాయిలో పార్టీ పటిష్టతను పెంపొందించేందుకు కాంగ్రెస్ పార్టీ జెండా కార్యక్రమం ప్రారంభించాం అని తెలిపారు. కార్యకర్తలంతా సమన్వయంతో పని చేస్తూ కాంగ్రెస్ పార్టీ జెండాను ప్రతి గ్రామంలో ఎగురవేయాలని కోరారు . ఇది కేవలం ఓ కార్యక్రమం మాత్రమే కాదు, పార్టీపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచే చైతన్య యాత్ర" అని అన్నారు. అనంతరం గ్రామాల వారీగా షెడ్యూల్ను విడుదల చేశారు.



## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్, జయంతిని పురస్కరించుకొని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి జయశీల,ఆయన చిత్ర పటానికి పూలమాలను అలంకరించి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ యం సి చైర్మన్ ఎల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టి అద్యక్షులు వెన్నెల రమణారెడ్డి , ఏ యం సి వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, ఏ ఇ (పి ఆర్) సాయి తేజ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

### - నెక్కొండ, పర్వతగిరి తహశీల్ ఆఫీసుల్లో..
### - భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశాలు

**వేద న్యూస్, వరంగల్:**

భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం నెక్కొండ, పర్వతగిరి మండల తహసీల్దార్ కార్యాలయాలను ఆమె ఆకస్మికంగా సందర్శించి, భూభారతి అప్లికేషన్లను పరిశీలించారు. దరఖాస్తుదారులకు వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధించిన అన్ని దరఖాస్తులను సాధ్యమనంత త్వరగా పరిష్కరించి పెండింగ్ లేకుండా డిస్పోజ్ చేయాలన్నారు. భూభారతి దరఖాస్తులు పరిశీలించుటకు గడువు ఆగస్టు 15గా ప్రభుత్వం నిర్ణయించిన మేరకు భూభారతి సదస్సులలో స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పాత రికార్డులను కూడా క్షుణ్ణంగా పరిశీలించి రేపటిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం అటెండెన్స్ పరిశీలించి కార్యాలయంలో పర్సనల్ రిజిస్టర్స్ మూమెంట్ రిజిస్టర్ నిర్వహించాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరి అని తహశీల్దార్లకు సూచించారు.



## శివారెడ్డిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**వేద న్యూస్, హుజుర్ నగర్ :**

హుజూర్ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాముల శివారెడ్డికీ ఇటీవల కాలుకి గాయమై అది ఇన్ఫెక్షన్ అయి చిన్న శస్త్ర చికిత్స జరిగింది. హాస్పటల్ నుండి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చిన సాముల శివారెడ్డిని బుధవారం ఆయన నివాస గృహంలో పరామర్శించి ఆయన యోగ క్షేమాల్ని అడుగు వేయాలని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం డి అజీజ్ పాషా, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, జక్కుల మల్లయ్య,సమ్మెట సుబ్బరాజు,అబ్దుల్ మజీద్, కోలమట్టయ్య,బొడ్డు గోవిందరావు, పి.రామ్మూర్తి,చిన్నం శ్రీనివాస్, బంటు సైదులు,ఎస్కే ముస్తఫా, ఇట్టి మల్ల బెంజిమెన్, భార్గవ్ గౌడ్ తదితరులు ఉన్నారు.



## బోయినిపల్లి లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

**వేద న్యూస్,బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కొత్తపెల్లి జయశంకర్, 91 వ జయంతి సందర్భంగా అతని చిత్ర పటానికి పూల మాల వేసి స్వీట్స్ పంచడం జరిగినది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ విశ్వ బ్రాహ్మణ ముద్దు బిడ్డ ,తెలంగాణ సిద్ధాంత కర్త అని,తెలంగాణ సాధించడం లో ప్రొఫెసర్ జయశంకర్, పాత్ర మరువలేనిది అని ఆ మహా నియుని జన్మదిన వేడుక జరుపటం మన అందరికీ గర్వ కారణము అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వుదారి నరసింహ చారి,బొగోజీ గంగాధర్ చారి,కనపర్తి హన్మాండ్లు,బోగో జి. భూమయ్య,అక్కపెల్లి శంకరయ్య,ఊదారి రమేష్,బుర్గుపెల్లి శ్రీనివాస్,నరసింగోజు హన్మండ్లు,మోగులో జి భక్కయ్య ,మొగులో జీ. రమేష్,మోగులా జి ఆంజనేయులు,కుంబోజు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




## నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

### - కలెక్టర్ స్నేహ శబరీష్

**వేద న్యూస్, హన్మకొండ:**

నులిపురుగుల నిర్మూలన కోసం 1 నుండి 19 సంవత్సరం లోపు వారందరికీ ఈ నెల 11 న ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లావ్యాప్తంగా ఈ నెల 11 వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంపై డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ 1 నుండి 19 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరికీ నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య ఆరోగ్యశాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ విభాగాలు, ప్రైవేట్ పాఠశాలలు ,కళాశాలల యజమాన్యాలను ఆదేశించారు. పిల్లలలో నులిపురుగులు ఉండటం వలన వారిలో పోషకాహార లోపం ,రక్తహీనత ,ఆకలి మందగించడం తదితర ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని, వీటివల్ల చదువుపై ఏకాగ్రత కోల్పోతారని అన్నారు. సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడం వల్ల పిల్లలలో ఈ సమస్యల నుండి చాలా వరకు మెరుగుదల కనిపించిందన్నారు. అన్ని పాఠశాలలు, హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలలో ఈ మాత్రలు ఇవ్వబడతాయని ,బడి బయట పిల్లలకు కూడా ఈ కేంద్రాలలోనే మాత్రలు తప్పకుండా ఇప్పించాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రం ,పాఠశాల, కళాశాల కు ఒక అంగన్వాడీ కార్యకర్త ,ఆశా కార్యకర్త,ఏఎన్ఎంలను అనుసంధానం చేయాలని, రెసిడెన్షియల్ పాఠశాలలు కళాశాలలో ఉన్న ఏఎన్ఎంలు లేదా నర్సింగ్ ఆఫీసర్లు సంబంధిత ఇన్స్టిట్యూషన్ లో అందరికీ అందించాలన్నారు.

జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరంలోపు (2,35,000) పిల్లలు ఉన్నారన్నారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల రీజనల్ కోఆర్డినేటర్లను కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలన్నారు. ఈ సమావేశం లో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మాత్రల వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని, ఎలాంటి అపోహలు ఉండకూడదన్నారు. మండల స్థాయి సమావేశంలో సంబంధిత విభాగాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల ఇన్చార్జిలను భాగస్వాములను చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు చేతుల శుభ్రత, మంచి




ఆహార అలవాట్లు తదితర అంశాలపై అవగాహన కలిగించాలన్నారు.

ఒక సంవత్సరం నుండి రెండు సంవత్సరాల వారికి సగం మాత్ర పొడిచేసి ఇవ్వాలని, రెండు సంవత్సరములు ఆ పై 19 సంవత్సరముల వారందరికీ ఒక పూర్తి మాత్ర నమిలి మింగించాలన్నారు. భోజనానంతరం వీరందరికీ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రోగ్రాం అధికారులు, ఆర్బీఎస్కే బృందాలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాయన్నారు. ఏదైనా కారణంతో 11 వ తేదీన మాత్రలు వేసుకోలేని వారికోసం 18వ తేదీన మాపప్ రౌండ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్ డీవార్మింగ్ కు సంబంధించిన అన్ని అంశాలను, యాక్షన్ ప్లాన్ ,మందులు , ఇతర అంశాలను అలాగే వివిధ డిపార్ట్మెంట్ల బాధ్యతలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి, గణేష్ ,డిఆర్డిఓ మేన శ్రీను, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి ,జిల్లా సంక్షేమ అధికారి జయంతి, సోషల్ వెల్ఫేర్ డీడీ నిర్మల, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ప్రేమకళా, జిల్లా పంచాయత్ అధికారి లక్ష్మి రమాకాంత్, బీసీ సంక్షేమ అధికారి శ్రీ లక్ష్మణ్ మైనారిటీ వెల్ఫేర్ అధికారి గౌస్ హైదర్, పీడియాట్రిక్ అసోసియేషన్ నుండి డాక్టర్ నవీన్, డెమో అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వర్షకొండలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. హెల్త్ సూపర్వైజర్ బి హేమలత, హెచ్ఈఓ కృపాకర్, ఎమ్ఎల్హెచ్పి బి గణేష్ హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ హేమలత మాట్లాడుతూ ఆగస్టు 1 నుండి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వారోత్సవాలలో భాగంగా పుట్టిన వెంటనే గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, తల్లిపాలు పిల్లలకు రోగానిరోధక శక్తిని పెంచుతుందని వారు పేర్కొన్నారు. కాబట్టి పుట్టినప్పటి నుండి 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పిల్లలకు పట్టించాలని అన్నారు. గర్భిణీలకు బాలింతలకు అవగాహన కల్పించేందుకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గర్భిణీ స్త్రీలకు సీమంతం, అన్నప్రాసన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్ భవానీ, ఆశా వర్కర్లు వినోద, ప్రమీల, వనిత,



అంగన్వాడీ టీచర్లు చిన్న గంగు, త్రివేణి, పద్మావతి, నీలిమ, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం ఆగస్టు 07, 2025

# సంపాదకీయం

సభాపతికి గడువు

ప్రజాస్వామ్య స్ఫూర్తికి పట్టిన జాడ్యం ప్రజాప్రతినిధుల ఫిరాయింపులు. ఒక పార్టీ నుంచి ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు, ప్రజల అభీష్టానికి భిన్నంగా మరో పార్టీలోకి మారడం ప్రజాభిప్రాయాన్ని అపహాస్యం చేయడమే. ఈ దురంతాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత అందరికన్న ఎక్కువగా శాసన సభాపతులపై ఉన్నది. అటువంటి శాసన సభాపతి నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తే? అదే సమయంలో ముఖ్యమంత్రి పదవి కూడా అత్యంత కీలకమైనదే. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేసి పదవీబాధ్యతలు స్వీకరించిన ముఖ్యమంత్రి అందులోని నిబంధనలకు విరుద్ధంగా శాసనసభలోనే నోరు పారేసుకుంటే? రాష్ట్రంలో ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో ఈ రెండు ఉల్లంఘనలు బాహాటంగానే జరిగాయని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు వెలువరించిన తాజా తీర్పు ఓ మైలురాయి వంటిదని చెప్పాలి. పై రెండు పదవులకు సంబంధించిన కీలక వ్యాఖ్యలు అందులో చోటుచేసుకున్నాయి. అందులో అతిముఖ్యమైనది 'మూడు నెలల్లోగా' నిర్ణయం తీసుకోవాలనే గడువును సభాపతికి విధించడం. నిజానికి సంవత్సరానికి పైగా గడువు ఎప్పుడో ముగిసిపోయిందని సుప్రీంకోర్టు ఎత్తిచూపడం గమనార్హం. గత శాసనసభ ఎన్నికల తర్వాత పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముందువెనుకగా కాంగ్రెస్ కండువాలు కప్పుకొన్నారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతలపై నాలుగు వారాల్లోగా స్పీకర్ నిర్ణయ ప్రక్రియను మొదలుపెట్టాలని ఏకసభ్య ధర్మాసనం సూచించింది. దీనిపై ప్రభుత్వం అప్పీలు చేస్తే డివిజన్ బెంచ్ ఆ నిర్ణయాన్ని పక్కన పెడుతూ 'సహేతుకమైన వ్యవధి'లో స్పీకర్ నిర్ణయించవచ్చని పేర్కొన్నది. ఈ సహేతుకమైన అనేదానిని ఎంతదాకానైనా సాగదీయవచ్చనే అర్థంలో తీసుకున్నారు. అంతేకాకుండా న్యాయపరిశీలన పరిధిలోకి స్పీకర్ రారని, కనుక గడువు విధించలేరని భాష్యాలు కూడా వెలువడ్డాయి. ఈ ఆదేశాలను పక్కన పెడుతూ సుప్రీంకోర్టు తాజాగా చరిత్రాత్మకమైన తీర్పును వెలువరించింది. స్పీకర్‌కు న్యాయస్థానం గడువు విధించవచ్చా? అనే ధర్మ సందేహానికి తిరుగులేని భాష్యంతో సమాధానమిచ్చింది.

ఈ సందర్భంగా పదో షెడ్యూల్‌ను ఉదహరించడం జరుగుతున్నది. సాధారణరీత్యా సభాపతి నిర్ణయాలు న్యాయ పరిశీలన పరిధిలోకి రావన్నది నిజమే. కానీ, ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతను నిర్ణయించే విషయమై సభాపతి ట్రిబ్యునల్‌గా వ్యవహరించే సందర్భంలో సర్వోన్నత న్యాయస్థానం న్యాయ పరిశీలన కిందకు వస్తారని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఎందుకంటే దేశంలోని ట్రిబ్యునళ్లు అన్నీ కూడా సుప్రీంకోర్టు పరిధిలోకే వస్తాయి. ఎఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు ఏమిటో తేలిపోయింది. ఇన్నాళ్లూ తాత్సారం చేస్తూ న్యాయాన్ని దక్కకుండా చేసిన శాసనవ్యవస్థ, రాజకీయ లబ్ధి కోసం ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కార్యనిర్వాహక పరిపాలనా వ్యవస్థ ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన పరిస్థితిలో పడ్డాయి. మరీ ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై కోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. ఉపఎన్నికలు రావని శాసనసభా వేదికపైనే ఆయన రాజ్యాంగ నియమాల పట్ల పూర్తి అగౌరవంతో మాట్లాడటంపై సుప్రీం అక్షింతలు వేసింది. ఇక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. అఈ మధ్య తరచుగా ఆయన రాజ్యాంగం ప్రతిని చేతిలో పట్టుకుని విలువల గురించి ప్రబోధిస్తున్నారు. కానీ, అదే రాజ్యాంగంలో తన తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ తెచ్చిన 52వ రాజ్యాంగ సవరణ ఉందనే సంగతి మరిచిపోతున్నారు. ఫిరాయిం పులను నిరోధించేందుకు తండ్రి తెచ్చిన ఆ సవరణకే ఇప్పుడు తనయుని ఆధ్వర్యంలో అదే కాంగ్రెస్ తూట్లు పొడుస్తున్నది. ఏదేమైనప్పటికీ న్యాయ నిర్ణయం జరిగిపోయి ంది. ఏవి పాలో, ఏవి నీళ్లో తేలిపోయింది. 'మూడు నెలల లోగా.. వీలైనంత త్వరలో' అని సుప్రీంకోర్టు కర్తవ్యబోధ చేసింది. మరింత జాగు చేయకుండా నిర్ణయం తీసుకుని ప్రజాతీర్పును గౌరవించేందుకు, గీతదాటిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేందుకు స్పీకర్ చర్య తీసుకుని న్యాయవ్యవస్థ పట్ల తమ గౌరవమర్యాదలు చాటుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

# నేను ప్రచారం చేసింది బెట్టింగ్ యాప్ కు కాదు!

- అక్రమ బెట్టింగ్ యాప్స్ కేసులో ఈడీ విచారణకు హాజరైన విజయ్ దేవరకొండ
- దాదాపు నాలుగున్నర గంటల పాటు ప్రశ్నించిన అధికారులు
- తాను ప్రభుత్వ అనుమతి ఉన్నవాటినే ప్రచారం చేశానని వెల్లడి
- ఇదే కేసులో ఇప్పటికే నటుడు ప్రకాశ్ రాజ్ విచారణ పూర్తి
- త్వరలో రానా, మంచు లక్ష్మి కూడా విచారణకు హాజరుకానున్న వైనం

**వేదన్యూస్ డెస్క్:**

అక్రమ బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించిన కేసులో ప్రముఖ టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో అధికారులు ఆయన్ను సుమారు నాలుగున్నర గంటల పాటు సుదీర్ఘంగా ప్రశ్నించారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన విజయ్ దేవరకొండ మీడియాతో మాట్లాడుతూ, తాను ప్రచారం చేసింది గేమింగ్ యాప్ కోసమేనని, బెట్టింగ్ యాప్ కోసం కాదని స్పష్టం చేశారు. ఈడీ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు తాను సమాధానాలు ఇచ్చానని విజయ్ తెలిపారు. "గేమింగ్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌ల మధ్య చాలా తేడా ఉంది. ప్రభుత్వం గుర్తించి, లైసెన్స్ ఇచ్చిన చట్టబద్ధమైన గేమింగ్ యాప్‌ను మాత్రమే నేను ప్రమోట్ చేశాను. ఈ విషయంపై అధికారులు అడిగిన అన్ని వివరాలు, కంపెనీ, ఆర్థిక లావాదేవీల సమాచారం అందించాను. నా వివరణతో వారు సంతృప్తి చెందారు" అని ఆయన అన్నారు. తాను ప్రచారం చేసిన %23 యాప్ కొన్నిచోట్ల ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించగా, "చట్టబద్ధమైన యాప్‌లకు జియో-లొకేషన్ లాక్ ఉంటుంది. తెలంగాణలో దాన్ని తెరవాలని ప్రయత్నిస్తే, ఈ ప్రాంతంలో అనుమతి లేదని సందేశం వస్తుంది. ఏ రాష్ట్రాల్లో అనుమతి ఉందో అక్కడే ఆ యాప్ పనిచేస్తుంది" అని విజయ్ వివరించారు. ఏది తప్పు, ఏది ఒప్పు అనేది ప్రభుత్వాలు, కోర్టులు నిర్ణయిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో ఈడీ విచారణ ఎదుర్కొన్న రెండో నటుడు విజయ్ దేవరకొండ. గత నెల 30న నటుడు ప్రకాశ్ రాజ్‌ను అధికారులు ఐదు గంటల పాటు విచారించారు. అయితే, తాను ఒక గేమింగ్ యాప్ కోసం ప్రకటన చేసినప్పటికీ, మనస్సాక్షి అంగీకరించకపోవడంతో ఎలాంటి పారితోషికం తీసుకోలేదని ప్రకాశ్ రాజ్ అధికారులకు తెలిపినట్లు సమాచారం. ఈ కేసులో భాగంగా ఈడీ మొత్తం 29 మంది సినీ ప్రముఖులు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసు నమోదు చేసింది. వీరిలో రానా దగ్గుబాటి, మంచు లక్ష్మికి కూడా నోటీసులు జారీ చేసింది. రానా ఆగస్టు 11న, మంచు లక్ష్మి ఆగస్టు 13న విచారణకు హాజరుకావాల్సి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నమోదైన పలు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది.



# ఆ పథకాలకు మీరు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు!

**వేదన్యూస్ డెస్క్:**




తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలలో కొన్నింటిని ఇప్పటికే అమలుచేస్తోంది. అయితే వీటిలో కొన్నింటికి రేషన్‌కార్డు ప్రమాణికంగా లబ్ధిదారులను గుర్తిస్తోంది. ఇందులో ముఖ్యంగా గృహజ్యోతి, మహాలక్ష్మి ఫ్రీగ్యాస్ పథకాలు ఉన్నాయి. గృహజ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగి ంచిన లబ్ధిదారులకు జీరో బిల్లు జారీ చేస్తూ ఉచిత విద్యుత్తును అందిస్తోంది. మహాలక్ష్మి పథకం కింద ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షనుదారులకు రూ.500ల సబ్సిడీతో సిలిండర్ అందిస్తోంది. అయితే రేషన్ కార్డులు ఉన్నవారే వీటికి అర్హులు కావడంతో.. రేషన్ కార్డులు లేని చాలా కుటుంబాలు ఈ పథకాలకు అర్హత పొందలేకపోయారు. అయితే వీరికి కూడా ప్రభుత్వ పథకాలను అందించేందుకు ప్రభుత్వ చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే గత కొన్నేళ్లుగా రేషన్ కార్డును లేని కుటుంబాలకు ఇటీవలే ప్రభుత్వం కొత్తరేషన్ కార్డులను జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల లబ్ధిదారుల జాబితాలో ఈ కొత్త రేషన్ కార్డు హోల్డర్స్‌ను చేర్చాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే ఈ రెండు పథకాలకు కొత్త రేషన్ కార్డు హోల్డర్స్ నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్టు పేర్కొంది. ఇందులో భాగంగానే ఉమ్మడి ఆదిలాబాద్? జిల్లాలో కొత్త రేషన్ కార్డులు పొందిన వేలాది మంది లబ్ధిదారులకు మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలు వర్తింపజేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. భీంపూర్ మండలంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో కొత్త రేషన్ కార్డు పొందిన లబ్ధిదారుల నుంచి ఉచిత విద్యుత్తు కోసం దరఖాస్తులు సేకరించారు. కొత్త రేషన్ కార్డు పొందిన లబ్ధిదారులు ఆయా పథకాలకు అప్లై చేసుకునేందుకు మీ సమీపంలోని ఎంపీడీవో, మున్సిపల్ ఆఫీసుల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాలను సంప్రదించాలి. పథకాలకు కావాల్సిన ధ్రువపత్రాలను తీసుకెళ్లి పథకాలకు అప్లై చేసుకోవాలి. ఉచిత విద్యుత్, కోసం నెలవారీ విద్యుత్తు బిల్లుతో పాటు ప్రజాపాలన రసీదు, కుటుంబసభ్యుల ఆధార్ కార్డు జిరాక్సులను అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. రూ.500 గ్యాస్ సబ్సిడీ కోసం ప్రజాపాలన కేంద్రంలో 17 అంకెల వినియోగదారు నంబరుతో పాటు గ్యాస్ సిలిండర్ తీసుకునే టైంలో ఇచ్చిన రసీదును తీసుకెళ్లాలి. అయితే గ్యాస్ ఏజెన్సీలో మీకు ఖచ్చితంగా కేవైసీ చేసుకొని ఉండాలి.

# సీఎంపై రాజగోపాల్ రెడ్డి విమర్శలపై స్పందించిన కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ

**వేదన్యూస్ డెస్క్:**

సీఎం రేవంత్ రెడ్డిపై సొంత పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. అయితే.. తాజాగా రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి స్పందించారు. రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని రాజగోపాల్ రెడ్డి విమర్శించడంపై ఉన్న కారణం ఏంటో తెలుసుంటామని మల్లు రవి తెలిపారు. రేపు రాజగోపాల్ రెడ్డితో మాట్లాడి వివరాలు తీసుకుంటామని చెప్పారు. రాజగోపాల్ రెడ్డితో మాట్లాడిన తర్వాత ఏం చేయాలనే దానిపై నిర్ణయం ఉటుందని స్పష్టం చేశారు. అన్ని విషయాలపై రాజగోపాల్ రెడ్డి నుంచి త్వరలోనే వివరణ తీసుకుంటామని పేర్కొన్నారు. రెండు రోజులగా బీసీ ధర్నా ఏర్పాట్లలో ఉన్నట్లు చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనలను ఎవరు పట్టించుకోకపోయినా వారిపై కఠిన చర్యలు ఉంటాయని మల్లు రవి తేల్చి చెప్పారు. మంత్రి పదవి ఇస్తానంటేనే కాంగ్రెస్‌లోకి వచ్చా అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్ పార్టీలో జూనియర్లకు మంత్రిపదవి ఇచ్చి తనను దూరం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరి ఎంపీని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు చెప్పారని తెలిపారు. ఇకపై తాను ఎంత దూరమైనా వెళ్తానని తేల్చి చెప్పారు.



మనసు చంపుకుని బతకడం తన వల్ల కాదన్నారు. ప్రజల కోసం మరోసారి పదవీ త్యాగానికైనా రెడీ అని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

# రాష్ట్రంలో కొత్తగా 15 నేషనల్ హైవేలు

**వేదన్యూస్ డెస్క్:**

రాష్ట్రంలో కొత్తగా జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లు, వంతెనల నిర్మాణానికి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) ప్రణాళికలు రూపొందించింది. మొత్తం 15 నేషనల్ హైవే-ఎన్‌హెచ్ పనులను చేపట్టనుంది. ఇప్పటివరకు ఉన్న 12 ఎన్‌హెచ్ పనుల కోసం డీపీఆర్ కన్సల్టెన్సీ కోసం బిడ్‌లను కూడా ఆహ్వానించింది. మరో మూడు పనులకు త్వరలోనే డీపీఆర్ బిడ్‌లను పిలవడానికి సిద్ధమవుతోంది. మొత్తం 1,123 కిలోమీటర్ల మేర జరిగే ఈ పనులకు రూ.33 వేల కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమిక అంచనాలు రూపొందించారు. కన్సల్టెన్సీ సంస్థలు ఇచ్చిన నివేదికల ఆధారంగా త్వరలోనే ఈ ఎన్‌హెచ్ పనులను ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాబోయే మూడేళ్లలో ఈ పనులను పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

- మోర్త్ చేపట్టే ప్రాజెక్టుల ఎన్‌హెచ్‌లు ఇవే :

జాతీయ రహదారి -167, 167ఎన్‌లో భాగంగా జడ్చర్ల నుంచి కోదాడ వరకు నాలుగు వరుసల రహదారిగా నిర్మాణం, అలాగే మహబూబ్‌నగర్ బైపాస్ రహదారికి ఏర్పాటు. ఎన్‌హెచ్-63లో భాగంగా నిజామాబాద్-జగ్‌దల్‌పూర్ సెక్షన్‌లో రహదారి పనులతో పాటు అలానే బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు, బోధన్-నిజామాబాద్ సెక్షన్ పరిధిలో రోడ్డు విస్తరణ, వంతెనల ఏర్పాటు. ఎన్‌హెచ్-765డీలో భాగంగా హైదరాబాద్ ఓఆర్ఆర్-మెదక్ సెక్షన్ మధ్య నాలుగు వరుసల రహదారి, మెదక్ బైపాస్ నిర్మాణ ఎన్‌హెచ్-30లో భాగంగా రుద్రంపుర్-భద్రాచలం సెక్షన్ మధ్య నాలుగు వరుసల రహదారితో పాటు కొత్తగూడెం, పాల్వంచపై బైపాస్ రోడ్డు నిర్మాణం. జాతీయ రహదారి -365, 365బీ, 365బీబీలో భాగంగా నకిరేకల్-తానంచర్ల సెక్షన్ పరిధిలో రహదారి ఏర్పాటు, బ్రిడ్జి నిర్మాణం పనులు. సుర్యాపేట-జనగామ సెక్షన్ మధ్య నాలుగు వరుసల రహదారి ఏర్పాటు, ఖమ్మం నుంచి సత్తుపల్లి మధ్య హైవే నిర్మాణం

ఎన్‌హెచ్-61లో భాగంగా కల్యాణ్-నిర్మల్ సెక్షన్‌లో నాలుగు లైన్ల రహదారి ఏర్పాటు

ఎన్‌హెచ్-563లో భాగంగా ఖమ్మం నుంచి వరంగల్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం

జాతీయ రహదారి-163లో భాగంగా మన్నెగూడ-రావులపల్లి సెక్షన్ మధ్య నాలుగు లైన్ల రహదారి పనులు, హైదరాబాద్ నుంచి భూపాలపట్నం మధ్య పలు చోట్ల రహదారులు, వంతెనల ఏర్పాటు

ఎన్‌హెచ్-353సీలో భాగంగా భూపాలపల్లి , పరకాల బైపాస్ రహదారుల నిర్మాణం ఏర్పాటు

హైవేపై ప్రయాణించే సమయంలో వాహనంలో ఏమైనా సమస్యలు ఎదురైతే ఏం చేయాలో అర్థం కాదు. ఆ సమయంలో ఎవరికి ఫోన్ చేయాలో తెలియదు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073